# అమరుడు

ఎక్కుపెట్టి వదలిన బాణంలా దూసుకు పోతున్నది బస్. అయితే ఒకటే తేడా. బాణం సూటిగా వెళ్తుంది. బస్ నైస్‌గా మలుపులు తిరుగుతూ వెళ్తుంది. ఈ భావం స్ఫురించగానే మెల్లిగా నవ్వుకుని తలపైకెత్తాను. చందమామగారు తారమ్మ అత్తగారితో ఫస్ట్‌షో కెళ్ళి మెల్లిగా పదకొండింటికి డ్యూటీ కొస్తున్నాడు. లేటుగావని కొచ్చినందుకు ఆకాశం బాస్‌గారు తిట్టారు కాబోలు. మొహం కళావిహీనమై చిన్నదై పోయి వుంది.

ఏం చేయడానికీ తోచడం లేదు. మసక వెన్నెల్లో ప్రకృతి సౌందర్యాలో కనం చేయటానికి కష్టంగావుంది. ప్రక్కనున్న ప్రయాణికుని చేతిలోని 'విశాలాంధ్ర' అడిగి తీసుకుంటూ— ప్రక్కవారి పత్రిక చూసిస్తానని తీసుకునే విషయంపై 'బాపు'గారు ఎప్పుడో ఎక్కడో వేసిన ఏదో కార్టూను గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకున్నాను.

కళా స్రవంతి, సినిమా పేజీల కోసం కళ్ళతో వెతుకుతూ పేజీలు తిరగేశాను. శ్రీ కాళోజీ గారు రాసిన గేయం కళ్ళబడింది.... చదివాను.

బాలగంగాధర తిలక్........ఖాళీ పూర్తి చేయలేక పిచ్చిగా రెండుమూడు సార్లు మళ్ళీ ఉచ్చరించుకున్నాను సంశయంగా.

"మల్లెపూవు" కన్పించింది. చదివాను.

ఇంకేముంది! సంశయం నిజమైంది.

తిలక్‌గారు లేరు అని విశాలాంధ్ర గట్టిగా అరచి నట్లనిపించింది నాకు.

మనసంతా ఏదోగా ఐపోయింది. ఆయనగారు రాసిన కథలూ, గేయాలూ వాటి గొప్పతనమూ గుర్తొచ్చేయి.

ఆ కలంనుండి ఇక అలాంటి గొప్ప కథలు రావు. వేరేవాళ్ళు గొప్ప కథలు రాయొచ్చు. కాని.... ఏదోలోటు ఆయన కథలు కనబడక పోతే!

ఆప్తులెవరో పోయినట్లు ఫీలయ్యాను.

ఆయన అభిమానులంతా అలాగే ఫీలౌతారు కాబోలు. ఆహా రచయితలే ధన్యులు అనుకున్నాను. రచయిత గొప్పదనమూ, మా బోటి పాఠక లోకంలో వారికున్న విలువా అలా ఆలోచించుకుంటే ఈ పాళాన జాయ్ పాతాళభైరవి నాదగ్గరుంటే. అన్నా నన్నో గొప్పకవిని చెయ్! అనేవాణ్ణి.

అలా ఏదో ఆలోచించు కుంటున్న నేను డ్రైవర్‌కోసిన ఓ టర్నింగుతో ఈ లోకంలో వున్న ఈ బస్‌లోని స్పాంజ్ సీట్లోకొచ్చి పడ్డాను.

---

ద్వితీయ బహుమతి రూ. 25

బి. జె. సంపత్‌రావ్
బి. కాం. రెండవ సంవత్సరం
ఎస్. వి. ఆర్ట్సు కాలేజీ
తిరుపతి, చిత్తూరుజిల్లా.

కొంపదీసి దేనికేనా డాష్ యిస్తాదేమో!

"మా అమ్మకు నేనే పెద్దాణ్ణి బాబాయ్! మెల్లిగా నడుపు!" అందామనుకున్నాను డ్రైవర్‌తో. పిచ్చాణ్ణనుకుంటాడేమో ననుకుని, మానేసి, విశాలాంధ్ర తిరిగి యిచ్చేసి నా ప్రాణాన్ని డ్రైవర్ చేతిలో పెట్టి సీట్లో వెనక్కి జారగిల బడ్డాను.

మళ్ళీ ఏవో ఆలోచనలు. ఓడిపోయిన మనిషి. సీతాపతికథ, దేవుణ్ణి చూసినవాడు, సుందరీ సుబ్బారావు, ఊరు చివర యిల్లు, కాస్మాపాలిటన్, కఠోపనిషత్ మొదలైన వెన్నో జ్ఞాపకం వస్తున్నాయి అలవోకగా. అవన్నీ ఆయన రాసిన కధలూ, గేయాలూ.

"ధన్"

దగ్గర్లోనే పేద్ద చప్పుడు. తలమీద ఎవరో బలంగా మోదినట్లయింది. మెదడు బయటికి వచ్చేస్తున్నట్లయి, రెండు చేతుల్తో తల పట్టుకుని గాభరాగా కళ్ళు మూసుకున్నాను.

నా మొహంపై చినుకులు పడి చల్లగా తగలగా కళ్ళు తెరిచాను.

మీతో సర్దాగా ఓ గంట
మాట్లాడే అదృష్టం
ఎన్నాళ్ళకి కలిగింది సార్



ప్రశాంత గంభీర, సుందర వదనం. పెదాలపై చిరుదరహాసం. మల్లెల్లాంటి వలువలు ఆయన మృదువైన తొడమీద నా తల.

లేవ బోయేను.

"పడుకో! విశ్రాంతి తీసుకో!" అన్నారాయన.

ఆయన ఆదరణకూ, ఆప్యాయతకూ సిగ్గు పడ్డాను. అరనిముషమాగి వద్దంటున్నా లేచాను.

నమస్కరించి "మీరెవరండీ?" అన్నాను వినయంగా.

"ఏం? అంత అవసరమా?తిలక్!" అన్నారాయన.

ఆశ్చర్యపోయాను. ఏదో స్ఫురించింది.

"బాల గంగధర తిలక్ గారా? రచయితలా?....కరిగోపనిషత్తు. సీతా.... ఉత్సాహంగా అడగబోయాను.

"ఎక్కువగా మాట్లాడకు! నేనే ఆయన్ని! తలపగిలివుంది నీకు. ఉద్రేకం తెచ్చుకోకు" అన్నారాయనవారిస్తూ.

హమ్మయ్య అనుకున్నాను. కాని పేపర్లో వార్తలు........? సందేహం!

"మాస్టారూ! మీరు చనిపోయారని......."

"లేదబ్బాయ్! నే చనిపోలేదు. చనిపోను. నీ ప్రక్కనే వుంటాగా! గాభరా పడక విశ్రాంతి తీసుకో!" అన్నారు మృదువుగా నవ్వుతూ.

కళ్ళుమూసుకుం........

సడెన్ బ్రేక్‌కితూలిపడి, ముందున్న కమ్మికి కొట్టుకుని, కళ్ళు తెరచి నేను క్షేమంగా బస్‌లోనే వుండటంగమనించి, అదంతా కలా? అనుకున్నాను.

యాక్సిడెంటూ - అదీ - అంతా అబద్ధమా?

నమ్మబుద్ధి కాలేదు.

ప్రక్కకి చూశాను.

మల్లెల్లాంటి వలువల్లో నిండైన వ్యక్తి.

ఆశ్చర్యపోయి, ఆత్రుతగా.... 'రచయిత బాల గంగాధర తిలక్ గారు మీరేనా?' అన్నాను గబ గబా.

బలేవాడివయ్యా, ఆయనెక్కడ? నేనెక్కడ? ఆయనిటీవలే పోయారు. ఆయనమీద కాళోజీ, శ్రీశ్రీలు రాసిన గేయాలూ, ఆదివిష్ణు రాసిన స్మృతీ చూడు అన్నా డా వ్యక్తి నవ్వుతూ,విశాలాంధ్ర మళ్ళీ నా కిస్తూ.

మళ్ళీ తీసుకుని కళ్ళకు అద్దుకుని, అది చదివాను.

'లేదు-చనిపోలేదు. ఆయన అమరుడు పాఠక హృదయాల్లో నిత్యమూ సజీవుడు' అనుకున్నాను ఏదో సత్యం తెలిసినట్లు.

సత్పాఠక హృదయాధినేత కీ. శే. శ్రీ బాలగంగాధర తిలక్ గారికి అంకితం.

★★★